# వీపు మీద మసి

-బి.వి.డి.ప్రసాదరావు

వెంకటరావు రాక నన్ను కుదిపేసింది.

అప్రయత్నంగానే అతడిని లోనికి రమ్మనమన్నాను.

అతడు వచ్చి కుర్చీలో కూలబడినట్టు కూర్చున్నాడు.

ఎన్నాళ్ళు అయిందో వెంకటరావును చూసి! మనిషి బాగా చిక్కిపోయాడు. మాసిన గడ్డం, నూనె పెట్టక బిరుసెక్కిపోయిన జుత్తు, కూరుకుపోయిన బుగ్గలు, లోతుల్లోకి దిగజారిపోయిన అతడి కళ్ళు...

నాకు చికాకు అనిపించింది.

దుమ్ముపట్టి మరకలు కట్టిన అతడి బట్టలు, స్నానం లేకో.. జబ్బుపడో పాలిపోయిన అతడి శరీరం...

అతడిని పూర్తిగా పరిశీలించిన వెనువెంటనే నా కడుపులో తిప్పు మొదలయ్యింది.

తల తిప్పుకున్నాను. వీధిగుమ్మం ముందున్న గులాబీ మొక్క మీద నా చూపు పడింది. దానికి పువ్వులు నిండుగా వున్నాయి. ఆహ్లాదమైంది.

నాలో తిప్పు తగ్గుతోంది.

అతడు ఎందుకు వచ్చాడో? వచ్చినప్పటి నుంచీ ఏమీ మాట్లాడడంలేదు.

అప్పుడే నామనవరాలు వచ్చింది. నా చెంతచేరింది. వెంకటరావును చూసి, 'బూచి' అంది పుసుక్కున. దానికి మూడేళ్ళు. నా రెండో కొడుకు కూతురు. "తాతా.. బూచోడు" అంటుంది. తన మూతి మూశాను నా ఎడమ చేత్తో.

❖ ❖ ❖

నేను ఉద్యోగరీత్యా గుంటూరులో ఉన్నప్పుడు మా కుడిపక్క వాటాలో ఒక సామాన్య కుటుంబం ఉండేది. ఆ కుటుంబ యజమాని వెంకటరావు. అతడి భార్య సుశీలమ్మ, కొడుకు కృపారావు, కూతురు జమున.

కృపారావు ఇంటర్మీడియెట్ చదువుతుండేవాడు. జమున పదవ తరగతి చదువుతుండేది. వెంకటరావు లారీ పార్సిల్ సర్వీసులో చిరుద్యోగి. పైసా పైసా లెక్కలతో అతడి కాపురం నడుస్తోందని గ్రహించడానికి నాకు ఆట్టే కాలం పట్టలేదు.

నా భార్య అన్నపూర్ణ గురించి ముచ్చటిస్తే వెంకటరావు వాటం చాలామేరకు వెల్లడవుతోంది.

మాకు ఇద్దరూ మగపిల్లలే. ఆడపిల్లలు లేరు. అందుకే జమున అంటే అన్నపూర్ణ ఇష్టపడుతోంది. ఎక్కువగా ఆమెతో మెసులుటకు మొగ్గుచూపుతుండేది. చనువుగా ఆమెను తన దరితీసుకొని ముచ్చటపడిపోతుండేది.

"పండుగకు జమునకూ బట్టలు తీద్దామండి" అంది నాతో ఒకరోజున అన్నపూర్ణ.

"ఆమెకా?" అన్నాను మామూలుగా.

నేను కాదన్నా అన్నపూర్ణ ఒప్పుకోదని నాకు తెలుసు. ఎందుకంటే, వెంకటరావు లేమి ప్రస్తావనగా ఎత్తి, నన్ను కట్టడి చేసుకోగలదని నాకు తెలుసుకనక.

అయినా నేనన్నాను, "నీలాంటి వారి కనికరం అతడికి పుష్కలంగా లభిస్తుందిగా. నీలాంటివారి అండ అతడికి భారం విలువ, బాధ్యత తెలియనీయడంలేదు" అని.

"నేనుకాకపోతే వేరొకరిఅండ అతడికి అందకపోదు. అతడి బ్రతుకు ఇరుకైనంత మాత్రాన్న లోకం కూడా ఇరుకు అనుకోకండి" అంది అన్నపూర్ణ నిష్టూ రంగా.

నాకు తెలుసు, అన్నపూర్ణ అంతగా అతడిని వెనుకేసు కొస్తుంటే, దానికి జమునే కారణమని.

జమున కూడా తన సొంత తల్లిని 'అమ్మా.. అమ్మా' అని అన్నిమార్లు పిలవదేమో! అన్నపూర్ణను మాత్రం 'అమ్మా' అంటూ నీడలా అంటిపెట్టుకుపోయి తిరుగుతుంటుంది.

చెప్పకేం, ఇది వెంకటరావు 'ఉసికొలుపు' అనే నాకు అనిపిస్తుండేది. మరి అతడి పబ్బం తీరుతోందిగా.

జమున ద్వారా చేబదుళ్ళు, మా ఇంటి వంటకాలు వగైరా వాళ్ళింటికి వయ్యారంగా నడుచుకు పోతున్నాయిగా.

నేను ఉసురుమంటున్నా అన్నపూర్ణ పట్టించుకొనేది కాదు. సర్దుకుపోవడం అలవాటైన వారిలో నేనూ స్థానం పొందానని సరిపుచ్చుకోవడం తప్ప వేరే వెసులుబాటు నాకు ఎన్నడూ తారసపడలేదు.

కాలం తన పని తాను చేసుకు పోతోంది.

జమున పరీక్ష తప్పింది. దానికి అన్నపూర్ణ ఎన్నో రోజులకు తేరుకోగలిగింది. నిజానికి తను కుదుట పడడానికి కారణం 'వెంకటరావు ఎత్తుగడే' అని నాకు తోచింది.

"జమునకు పెళ్ళి చేసేయాలనుకుంటున్నాను" అని వెంకటరావు చెప్పాడు ఒకరోజున గబుక్కున.

ఆ తర్వాత, 'మీ పెంపుడు కూతురుకు మీ చేతుల మీదనే పెళ్ళి జరగాలి' అన్న ప్రతిపాదనను అన్నపూర్ణ చెంతకు చేర్చాడు సుశీలమ్మ ద్వారా- జమునను కూడా పంపి.

దాంతో అన్నపూర్ణ ఒక్కమారుగా పొంగి పొర్లిపోయింది. తెగ హైరానా పడిపోయింది.

ఎట్టకేలకు ఒక ఎలక్ట్రీషియన్‌ని వరుడుగా తేగలిగాడు వెంకటరావు, జమునకు.

పెళ్ళికి డబ్బును కొంతమేరకు అప్పుగానే సర్దమని నాకు వర్తమానం పంపాడు అన్నపూర్ణ ద్వారానే.

కాదన్నా, అన్నపూర్ణ నా మాటను ససేమిరా అనేసి, "అప్పుగానే కదా, సర్దండి" అని గట్టిగా కోరింది నన్ను. నేను 'ఉఁ' కొట్టక తప్పలేదు.

అన్నపూర్ణ వత్తిడి మేరకు పాతికవేలు సర్దాను అప్పుగానే- వడ్డీ లేకుండానే.

జమున పెళ్ళి బాగానే గట్టెక్కిపోయింది. అన్నపూర్ణ లాంటివారి చొరవలతో.

జమున అత్తవారింటికి వెళ్తున్నప్పుడు కంటే, ఆమె అక్కడకు వెళ్లిన తర్వాత అన్నపూర్ణను ఓదార్చడం నా వల్ల కాలేదు.

కాలం కరిగిపోతోంది.

జమున పెళ్ళికని బట్టలు, ఇంటి సామగ్రి, ఇతరత్రా అన్నపూర్ణ బాగానే ముట్టచెప్పిందని నాకు నెమ్మది నెమ్మదిగా తెలియవచ్చింది.

వెంకటరావు 'గట్టివాడే' అనుకోనా- 'బ్రతుకు ఎరిగినవాడే' అనుకోనా! నాకు ఏమీ పాలుపోవడం లేదు.

నా మొరను తన వీలువెంబడి తీర్చాడు దేవుడు. నాకు విజయవాడకు బదిలీ అయింది.

దేవుడుకి ధన్యవాదాలు తెలుపుకున్నాను.

విజయవాడకు వచ్చిన కొన్నాళ్లకు అన్నపూర్ణ తేరుకోగలిగింది. జమున ఆలోచనల నుంచి. ముఖ్యంగా పెద్ద కోడలుగా కరుణ రావడంతో.

వెంకటరావు అప్పుగా తీసుకున్నది తిరిగి ఇవ్వడానికి, అదీ తడవ తడవగా చెల్లించడానికి ఎన్నో సంవత్సరాలు తిప్పాడు. అయినా ఇప్పటికీ పూర్తిగా తీర్చలేదు. ఇంకా మూడువేలు ఇవ్వాలి.

"చాల్లెండి, ఇంకా ఏం ఇస్తారు. వదిలేయండి. మరి కబుర్లు చెయ్యకండి" అనేది అన్నపూర్ణ చాలామార్లు.

❖ ❖ ❖

"తాతా.. తాతా.. బూచి.. చూడు" అంటూ నా మనవరాలు నన్ను కదుపుతూంటే ఆలోచనల్లో నుంచి బయటకు వచ్చి చూశాను.

'అరె వెంకటరావు! ఏమిటి అలా ఒరిగిపోయాడు' అనుకుంటూ లేచాను- మనవరాలిని పక్కన పెడుతూ.

భయంతో కేకే వేశాను. అన్నపూర్ణ వచ్చింది.

వెంకటరావును చూసి "అన్నయ్యగారు, ఎప్పుడు వచ్చారండీ" అంటూ-

"అలా పడిపోయారేమిటి?" అంది కంగారుగా.

ఇంతలో కరుణ వచ్చింది. మా ఆత్రం చూసి, వెంకటరావు చెంతకు వెళ్ళి, పరిశీలించింది.

"అయ్యో.. ఈయన చనిపోయారు" అని చెప్పింది.

నేను హడలిపోయాను. తేరుకుంటూ, ఆ తర్వాత నా కొడుకులు, చిన్నకోడళ్ళి ఆఫీసుల నుంచి రప్పించాను- ఫోన్లు చేసి.

కృపారావుకూ ఫోన్‌చేసి, అతడినీ రప్పించాను- గుంటూరు నుంచి.

"నాన్నకు ఈ మధ్య ఒంట్లో అసలు బాగాలేదు. నేను వెళ్తానన్నా ఒప్పుకోక, చివరి వాయిదా- తనే స్వయంగా ఇచ్చేసి, మీకు పాదాభివందనాలు చేయాలని వచ్చారండీ" చెప్పాడు కృపారావు భోరున ఏడుస్తూ.

నా కొడుకులు వెంకటరావు మృతదేహాన్ని అతని ఊరుకు తరలించే ఏర్పాటు చేస్తున్నాడు. టాక్సీ వచ్చింది.

కృపారావుతో అన్నాను, "మీ నాన్న నుంచి నాకా డబ్బు ముట్టలేదు"

కృపారావు తన తండ్రి మృతదేహం వద్దకు వెళ్ళాడు. జేబులు తడిమాడు. ఒక జేబులో నుంచి డబ్బు కట్ట తీశాడు. దానిని నాకు అందించాడు.

అవి మూడువేలు. లెక్క సరిపోయింది.

ఆ డబ్బును నా జేబులో పెట్టుకోబోతుండగా- నా కొడుకులు విసురుగా వచ్చి, చీదరింపుగా నన్ను చూస్తూ, ఆ డబ్బును లాక్కున్నారు. కృపారావును తీసుకొని, వెంకటరావు మృతదేహం వైపు కదిలారు.

నేను వారించబోతుండగా- అక్కడే ఉన్న అన్నపూర్ణ గబగబా వచ్చి, నన్ను ఇంట్లోకి లాక్కుపోయి-

"మీ ప్రవర్తన మమ్మల్ని నిజంగా భయపెడుతోం దండీ" అంది గట్టిగా.

వెంటనే, "వీపు మీద మసిని గుర్తు ఎరగండి" అంది ఆందోళనగా.

బయట టాక్సీ పోతోన్న శబ్దం...

అది అన్నపూర్ణ గొంతు ముందు పీలగా అన్పించింది.

భీతుడనయ్యాను.

■